


BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 సంచిక - 44 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 17-02-2026 మంగళవారం పేజీలు : 6

# తెలంగాణ 'పుర' పీఠాలపై హస్తం కేతనం

## : మున్సిపల్ పోరులో రేవంత్ మార్క్ క్లీన్ స్వీప్!


2 లో

హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల సమరంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. సోమవారం జరిగిన పరోక్ష ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకుని తన రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకుంది. అటు పల్లెల్లో (పంచాయితీ), ఇటు పట్టణాల్లో (మున్సిపల్) వరుస విజయాలతో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా అవతరించింది.

మేయర్ పీఠాలు హస్తగతం: ఉత్కంఠకు తెర

రాష్ట్రంలోని 7 నగరపాలక సంస్థలకు గానూ 5 చోట్ల కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యతతో మేయర్ పీఠాలను దక్కించుకుంది. నిజామాబాద్ & మహబూబ్‌నగర్: బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డి వ్యూహంతో కాంగ్రెస్ ఇక్కడ ఎంఐఎం మరియు స్వతంత్రుల మద్దతు కూడగట్టి మేయర్ పీఠాలను కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్ మేయర్‌గా గుమల్ మమత, నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి ఎన్నికయ్యారు.

నల్గొండ, మంచిర్యాల, రామగుండం: ఈ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్షంగా విజయం సాధించి జయకేతనం ఎగురవేసింది.

మున్సిపాలిటీలు: మొత్తం 116 మున్సిపాలిటీలకు గానూ దాదాపు 90కి పైగా చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఛైర్మన్లుగా బాధ్యతలు చేపట్టారు.

విజయానికి వెనుక 'రేవంత్' వ్యూహచతురత

ఈ విజయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వమే ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# సీఎం చంద్రబాబుకు, బిల్ గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం


2 లో

అమరావతి, ఫిబ్రవరి 16: వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతిక వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన గేట్స్‌కు రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచే కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. వ్యవసాయం-అనుబంధ రంగాల్లో దిగుబడి పెంపు, సాగు ఖర్చు తగ్గింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలిపారు. అలాగే నాణ్యమైన పంట ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక కార్యాచరణ అవలంభించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అనలిటిక్స్, మానిటరింగ్ డాష్‌బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మణి, అన్నపూర్ణ... ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ రైతు యాప్ గురించి గేట్స్‌కు తెలియజేశారు. ఈ యాప్ ద్వారా ఏ పంటలు పండించాలి, సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, పురుగు మందుల నియంత్రణ వంటి విషయాలు సులభంగా తెలుసుకుంటున్నామని చెప్పారు.

# పట్టాభిషేకం


2 లో

హైదరాబాద్ (బీఎన్ఎస్) : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా పూర్తయ్యాయి. రాష్ట్రంలోని మెజారిటీ స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, గతంతో పోలిస్తే బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకోవడానికి గట్టి ప్రయత్నం చేసింది. ఇక కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.

**రాష్ట్రవ్యాప్త ఫలితాల సరళి**

రాష్ట్రంలోని 120కి పైగా మున్సిపాలిటీలు, 10కి పైగా కార్పొరేషన్లలో ఎన్నికలు జరగగా, ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి.

కాంగ్రెస్ హవా: అధికారంలో ఉన్న అనుకూలతతో ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కాంగ్రెస్ మెజారిటీ పీఠాలను దక్కించుకుంది.

బీఆర్ఎస్ పట్టు: ఉత్తర తెలంగాణలోని కొన్ని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకుంది. ముఖ్యంగా సిద్దిపేట, గజ్వేల్ వంటి ప్రాంతాల్లో గులాబీ జెండా రెపరెపలాడింది.

# రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సమీక్ష


3 లో

అమరావతి, ఫిబ్రవరి 16 : పాలనలో వివిధ ప్రక్రియలను, నిబంధనల్ని మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్, బీజేపీలది అపవిత్ర కలయిక..


4 లో

# టెర్రర్ నెట్‌వర్క్‌పై మోదీ సర్కార్ సర్జికల్ స్ట్రైక్

## 'వైట్ కాలర్' ఉగ్రకుట్రను భగ్నం చేసిన భద్రతా దళాలు


4 లో


న్యూఢిల్లీ/శ్రీనగర్: దేశ భద్రతను అత్యున్నత ప్రాధాన్యతగా భావించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం, ఉగ్రవాదంపై సాగిస్తున్న పోరాటంలో మరో భారీ విజయాన్ని అందుకుంది. గత 10-12 ఏళ్లుగా ఉగ్రవాద కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణిచివేస్తున్న క్రమంలో, టెక్నాలజీని అడ్డుపెట్టుకుని మేధావుల రూపంలో సాగుతున్న 'వైట్ కాలర్' ఉగ్రవాదాన్ని భద్రతా దళాలు అత్యంత చాకచక్యంగా ఛేదించాయి.

డాక్టర్ల ముసుగులో 'అన్సార్ ఇంటీరియం' కుట్ర

జమ్మూకశ్మీర్ పోలీసులు మరియు జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

# బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు ఆత్మీయ స్వాగతం

- హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..? అంటూ సీఎం చంద్రబాబును పలకరించిన బిల్ గేట్స్
- మంత్రులను బిల్ గేట్స్‌కు పరిచయం చేసిన సీఎం చంద్రబాబు


2 లో

అమరావతి, ఫిబ్రవరి 16: హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..? ఇదీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి బిల్ గేట్స్ పలకరింపు. సోమవారం ఏపీలో పర్యటించేందుకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం మొదటి బ్లాకు వద్ద బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు. చంద్రబాబును చూడగానే.. బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు.

# చంద్రబాబు నాకు ఒక అపురూపమైన మిత్రుడు


2 లో

అమరావతి: చంద్రబాబు మీకు మిషనరీ వ్యక్తిగా కనిపించినప్పటికీ,నాకు ఒక అపురూపమైన బిల్ గేట్స్ తన అభిప్రాయాలను పంచుకున్నారు.

సెక్రటేరియేట్లోని సమావేశ మందిరంలో సీఎం, మంత్రులు, సెక్రటరీలతో సమావేశంలో బిల్ గేట్స్ పలు అంశాలను వెల్లడి చేశారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో సరదాగా వ్యాఖ్యానించారు,

భారతదేశంలో ఇన్నోవేషన్స్, వేగవంతమైన నిర్ణయాలు, చర్యలు అద్భుతంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. డిజిటల్ విప్లవానికి భారతదేశంలో బలమైన పునాదులు పడ్డాయని, భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని బిల్ గేట్స్ కితాబిచ్చారు.

తాను మొదటిసారి సీఎం చంద్రబాబును కలిసినప్పటి విషయాలను సమావేశంలో బిల్ గేట్స్ మంత్రులకు హెచ్వోడీలకు వివరించారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల విడుదల

## సత్తా చాటిన తెలుగు విద్యార్థులు

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ 2026 జనవరి సెషన్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు తమ సత్తాను మరోసారి చాటారు. జాతీయ పరీక్షల మండలి (చీూా) సోమవారం విడుదల చేసిన ఈ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 12 మంది టాపర్ల జాబితాలో ముగ్గురు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు స్థానం సంపాదించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్ లతో పాటు తెలంగాణకు చెందిన వివాన్ శరద్ మహేశ్వరి ఈ ఘనత సాధించి తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచారు. ఎస్సీ కేటగిరిలో ఏపీకి చెందిన దేవ శ్రీవేద్ టాపర్ గా నిలిచాడు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ ఏడాది జనవరి 21 నుంచి 29 వరకు జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలను నిర్వహించింది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా మొత్తం 13,55,293 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 13,04,653 మంది (96.26%) హాజరయ్యారు.


2 లో

# బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు ఆత్మీయ స్వాగతం

● హాలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..? అంటూ సీఎం చంద్రబాబును పలకరించిన బిల్ గేట్స్

● మంత్రులను బిల్ గేట్స్‌కు పరిచయం చేసిన సీఎం చంద్రబాబు



మొదటి పేజీ తరువాయి

హాలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ అంటూ సీఎం చంద్రబాబును బిల్ గేట్స్ అడిగారు. ఆ తర్వాత తన మంత్రివర్గ సహచరులను, సీఎస్ విజయానంద్‌ను బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి పరిచయం చేశారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను మంత్రి నారా లోకేష్ రిసీవ్ చేసుకున్నారు. విమానాశ్రయం వద్ద బిల్ గేట్స్‌కు స్వాగతం పలికిన బృందంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, సత్యకుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఉన్నారు.

# సీఎం చంద్రబాబుకు, బిల్ గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం

మొదటి పేజీ తరువాయి

ఏఐ ద్వారా పంట తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే డ్రోన్ సేవలు పొంది పురుగు మందులను వినియోగిస్తున్న తీరును తెలిపారు. బిల్ గేట్స్ సమక్షంలోనే రైతులు ఏఐ టూల్ ఉపయోగించి, వ్యాధి సోకిన మొక్క ఫోటో తీసి అప్లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట డ్రోన్ స్ప్రే చేసింది. ఇది స్వయంగా చూసిన బిల్ గేట్స్... రైతులకు ఏఐ-అగ్రి టెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. మరోవైపు స్థానిక రైతులతో బిల్ గేట్స్ ముఖాముఖి చర్చించారు. మొదటగా వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి, బిల్ గేట్స్‌కు మహిళా రైతులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. వారు స్వయంగా వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా సేంద్రీయ సాగు పద్ధతులతో పండించిన ఉత్పత్తులను బిల్ గేట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# చంద్రబాబు నాకు ఒక అపురూపమైన మిత్రుడు.

మొదటి పేజీ తరువాయి



ప్రపంచ దేశాల్లో తాను కలిసిన ఎంతో మంది నాయకుల ఆలోచనల కంటే చంద్రబాబు ఆలోచనలు చాలా ముందున్నాయని తొలి భేటీలోనే గ్రహించినట్టు వెల్లడించారు.

నాటి సింగపూర్ ప్రధాని కూడా చంద్రబాబు తరహా భిన్నమైన, విజన్‌తో కూడిన ఆలోచనలు చేసేవారని,

గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులు ఉన్నాయని బిల్ గేట్స్ తెలియజేశారు.

ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న దృక్పథంతో కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని బిల్ గేట్స్ అన్నారు.

విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి... వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి AI సహాయపడుతుందని,

విద్యారంగంలో అద్భుతమైన మార్పులు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని,

వ్యవసాయం రంగ చాలా ముఖ్యమైన రంగమని బిల్ గేట్స్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఏది ముఖ్యమో ఇప్పటికీ చాలా మందికి తెలియదని వ్యాఖ్యానించిన బిల్ గేట్స్

టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు,

టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేసేందుకు ఏపీ చేస్తున్న కృషికి అభినందించారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐ టెక్నాలజీని వినియోగంచడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ దాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండం మంచి పరిణామమని,డిజాస్టర్ మేనేజ్మెంట్ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలతో ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు బావుందని అన్నారు.

డిజిటల్ గవర్నెన్స్ అనే ఆలోచనను ప్రపంచానికి అర్థమయ్యేలా చెప్పడానికి తాను ప్రయత్నిస్తున్న సమయంలో సీఎం చంద్రబాబు దాని గురించి ఆలోచన చేయడమే అమలు చేశారని,

డ్రోన్లతో వివిధ రకాల సేవలు వినియోగించుకునే ఆలోచన అద్భుతంగా ఉందని తెలిపారు.మలేరియా, అనీమియా జబ్బుల నివారణ కోసం అందరం కలిసి పని చేయాలని బిల్ గేట్స్ సూచించారు.

సమావేశంలో మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్ మైక్రోసాఫ్ట్ హైదరాబాదులో ఏర్పాటు చేయడం వెనక కారణం అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారని ఆసక్తి చూపారని,

అదే సమయంలో చంద్రబాబు మైక్రో సాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్ లో పెట్టాలనే ప్రతిపాదన పెట్టిన అంశాన్ని, మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు కూడా చాలామంది హైదరాబాద్ సెంటర్ ఏర్పాటు చేస్తే తాము వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్టు అంగీకరించటంతో మైక్రోసాఫ్ట్ హైదరాబాదులో ఏర్పాటు చేసినట్లు మంత్రులు అడిగిన ప్రశ్నలకు బిల్ గేట్ సమాధానం చెప్పారు.

# తెలంగాణ 'పుర' పీఠాలపై హస్తం కేతనం: మున్సిపల్ పోరులో రేవంత్ మార్క్ క్లీన్ స్వీప్!

మొదటి పేజీ తరువాయి



వికేంద్రీకరణ పద్ధతి: మంత్రులు, ఎమ్మెల్యేలకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూనే, ఎప్పటికప్పుడు సమన్వయం చేయడం రేవంత్ రెడ్డికి కలిసొచ్చింది.

వ్యూహాత్మక పొత్తులు: హంగ్ ఏర్పడిన చోట్ల ఇతర పార్టీలు మరియు స్వతంత్రులను తనవైపు తిప్పుకోవడంలో ఆయన చేసిన 'ఆపరేషన్ ఆకర్ష్' ఫలించింది.

పథకాల ప్రభావం: 'ఇందిరమ్మ ఇళ్ల కిట్లు', రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఉన్న నమ్మకం పట్టణ ఓటర్లను కాంగ్రెస్ వైపు నడిపించింది.

కుప్పకూలిన విపక్షాల కుట్రలు

బీఆర్ఎస్, బీజేపీలు ఉమ్మడిగా కాంగ్రెస్‌ను అడ్డుకోవాలని చూసినా, రేవంత్ రెడ్డి 'క్రికెట్ – కబడ్డీ' తరహా వ్యూహాలతో వాటిని తిప్పికొట్టారు. ముఖ్యంగా నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి చోట్ల విపక్షాలకు అందకుండా కార్పొరేటర్లను కాపాడుకోవడంలో రేవంత్ సర్కార్ విజయం సాధించింది.

"ఈ విజయం ప్రజలు మా ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం. గత రెండేళ్లుగా మేము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు పట్టణ ఓటర్లు బ్రహ్మరథం పట్టారు." – రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి.

తెలంగాణ మున్సిపల్ ఫలితాల ముఖ్యాంశాలు:

కాంగ్రెస్: 5 మేయర్ పీఠాలు, 90+ మున్సిపల్ ఛైర్మన్లు.
బీజేపీ: కరీంనగర్ మేయర్ పీఠంతో సరిపెట్టుకుంది.
బీఆర్ఎస్: కేవలం కొన్ని మున్సిపాలిటీలకే పరిమితమైంది.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల విడుదల

## సత్తా చాటిన తెలుగు విద్యార్థులు

మొదటి పేజీ తరువాయి

సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో బీఈ/బీటెక్ (పేపర్ 1) విభాగంలో 12 మంది విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. అయితే, ఈ 12 మందిలో ఒక్క మహిళా అభ్యర్థి కూడా లేకపోవడం గమనార్హం. అత్యధికంగా రాజస్థాన్ నుంచి ముగ్గురు విద్యార్థులు టాపర్లుగా నిలిచారు.

మహిళల విభాగంలో హర్యానాకు చెందిన అషి గ్రేవాల్ 99.9969766 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచింది. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టినతేదీ వివరాలను ఉపయోగించి అధికారిక వెబ్‌సైట్లయిన jeemain.nta.nic.in మరియు nta.ac.in నుంచి తమ స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నార్మలైజేషన్ పద్ధతి ద్వారా తుది పర్సంటైల్‌ను లెక్కించినట్లు ఎన్టీఏ వెల్లడించింది.


ఈ సెషన్‌లో ఆశించిన స్కోరు రాని విద్యార్థులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ఏప్రిల్ 2026లో జరగనున్న రెండో సెషన్ పరీక్షలకు హాజరై తమ ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చని ఎన్టీఏ సూచించింది. రెండో సెషన్‌కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. జేఈఈ మెయిన్స్‌లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధిస్తారు. దీని ద్వారా దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీలలో ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుంది. మిగిలిన వారు ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 12 మంది టాపర్లు వీరే...



శ్రేయస్ మిశ్రా (ఢిల్లీ)
నరేంద్రబాబు గారి మహిత్ (ఆంధ్రప్రదేశ్)
శుభమ్ కుమార్ (బిహార్)
కబీర్ చిల్లార్ (రాజస్థాన్)
చిరంజీబ్ కర్ (రాజస్థాన్)
భవేష్ పాత్రా (ఒడిశా)
అనయ్ జైన్ (హర్యానా)
అర్ణవ్ గౌతమ్ (రాజస్థాన్)
పసల మోహిత్ (ఆంధ్రప్రదేశ్)
మాధవ్ విరాడియా (మహారాష్ట్ర)
పురోహిత్ నిర్మయ్ (గుజరాత్)
వివన్ శరద్ మహేశ్వరి (తెలంగాణ)

# పట్టాభిషేకం



మొదటి పేజీ తరువాయి

బీజేపీ సంచలనం: కరీంనగర్ కార్పొరేషన్ పీఠాన్ని బీజేపీ దక్కించుకోవడం ఈ ఎన్నికల్లో అతిపెద్ద మలుపుగా నిలిచింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యూహంతో ఇక్కడ కమల దళం మేయర్ పీఠాన్ని అధిరోహించింది.

హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రక్రియ

మేయర్, ఛైర్మన్ పదవుల కోసం ఆయా పార్టీలు తీవ్రంగా శ్రమించాయి. మ్యాజిక్ ఫిగర్ రాని చోట్ల స్వతంత్రులు మరియు ఇతర చిన్న పార్టీల మద్దతు కోసం ప్రధాన పార్టీలు క్యాంపు రాజకీయాన్ని నడిపాయి. ఆదివారం ఉదయం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన పరోక్ష ఎన్నికల్లో అత్యధిక బలం ఉన్న అభ్యర్థులు మేయర్లుగా, ఛైర్మన్లుగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు.

అభివృద్ధిపైనే దృష్టి: ముఖ్యమంత్రి


మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఇక పాలనపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎన్నికల రాజకీయాలను పక్కనపెట్టి, నూతన పాలకవర్గాలు ప్రజల సమస్యల పరిష్కారానికి, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు

# తెలంగాణ జాగృతిలో చేరిన మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య కుమారుడు మనోహర్

## కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించిన సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

బిఎన్ఎస్, హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే కావేటి సమయ్య కుమారుడు కావేటి మనోహర్ కుమార్ తెలంగాణ జాగృతిలో చేరారు. సోమవారం నాడు మనోహర్ కుమార్ కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కావేటి సబిత, అనుచరులు కూడా జాగృతిలో చేరారు.

ఈ సందర్భంగా కావేటి మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతిలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా సామాజిక తెలంగాణ, సామాజిక న్యాయం సాధన కోసం పోరాటం చేస్తున్న కల్వకుంట్ల కవిత గారికి మద్దతునివ్వడం కోసం జాగృతిలో చేరానని స్పష్టం చేశారు. తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి కవిత గారితోనే సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన



రాజకీయ పంథాను అవలంబిస్తూ యువతకు ప్రాధాన్యత ఇస్తున్న కవిత గారికి ప్రజల్లో మరింత ఆధరణ లభిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడానికి తాను పని చేస్తానని స్పష్టం చేశారు.

# తెలంగాణ రైతులకు తీపికబురు.. బోనస్ నిధులు విడుదల

తెలంగాణ రైతులకు ప్రబుత్వం తీపి కబురు చెప్పింది. వరి బోనస్ బకాయిలకు సంబంధించి నిధులను విడుదల చేసింది. వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కోసం రూ. 514.36 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ బోనస్ పంపిణీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన 2.17లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఈ నిధుల విడుదలతోపాటు పౌరసరఫరాల సంస్థ వరి బోనస్ కోసం రూ.1,939.58 కోట్లు విడుదల చేయనుంది.వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధర కంటే ఈ రూ.500 అదనమని, ఈ బకాయిలు చెల్లింపుతో రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం కలుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

# కొల్లూరు భూముల వివాదం

## ● లోకాయుక్త స్పష్టమైన ఆదేశాలు

## ● ఇప్పుడు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన సమయం

హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిసరాల్లో ఒకటైన కొల్లూరులో భూముల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సంవత్సరాలుగా అనిశ్చితిలో ఉన్న ప్లాట్ యజమానులు ఇప్పుడు ఆశతో ఎదురుచూస్తున్నారు. కారణం లోకాయుక్త ఇచ్చిన స్పష్టమైన తీర్పు.

ఈ వివాదంపై విచారణ జరిపిన తెలంగాణ లోకాయుక్త పలు అంశాలను పరిశీలించి కీలక సూచనలు చేసింది. సంబంధిత అధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తిన లోకాయుక్త, న్యాయపరమైన పత్రాలు కలిగిన ప్లాట్ యజమానుల హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది.

ప్లాట్ యజమానుల ఆశలు

కొల్లూరులో భూములు కొనుగోలు చేసిన అనేక మంది మధ్యతరగతి కుటుంబాలు సంవత్సరాలుగా తమ ఆస్తులపై అనిశ్చితి ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు ఉన్నప్పటికీ వివిధ కారణాలతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో లోకాయుక్త తీర్పు వారికి న్యాయపరమైన బలం ఇచ్చింది.

ప్రభుత్వం ముందు ఉన్న బాధ్యత

లోకాయుక్త ఆదేశాలు కేవలం సూచనలు మాత్రమే కావు; అవి ప్రజా న్యాయం దిశగా మార్గదర్శకాలు. ఒక రాజ్యాంగబద్ధ వ్యవస్థగా ప్రభుత్వం వాటిని గౌరవించి అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉంది. ప్లాట్ యజమానులు అడుగుతున్నది పెద్ద విషయం కాదు తమకు చట్టబద్ధంగా వచ్చిన హక్కులను రక్షించాలనే విజ్ఞప్తి




మాత్రమే. అధికార యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరిస్తే, ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

అభివృద్ధి న్యాయం కలిసే దిశగా

హైదరాబాద్ అభివృద్ధి కథలో కొల్లూరు కూడా ఒక భాగం. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు కాదు; ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం కూడా అంతే ముఖ్యము. లోకాయుక్త తీర్పును అమలు చేసి, ప్లాట్ యజమానులకు న్యాయం చేస్తే ప్రభుత్వం మీద ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.

ఇప్పుడు అందరి దృష్టి ప్రభుత్వ చర్యలపై ఉంది. లోకాయుక్త సూచనలను గౌరవిస్తూ స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే, కొల్లూరు వివాదానికి ముగింపు పలకవచ్చు. న్యాయం ఆలస్యం కాకుండా అమలు కావాలని ప్లాట్ యజమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

---

# రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 16 : పాలనలో వివిధ ప్రక్రియలను, నిబంధనల్ని మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు అత్యంత సులభంగా ప్రజలకు చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. దీనిపై అధ్యయనం కోసం ఓ కమిటీ వేయాలని ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం సమీక్షించారు. టెక్నాలజీ అనుసంధానంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దీనికి అనుగుణంగా ప్రతీ ప్రభుత్వ శాఖ సన్నద్ధం కావాలని.. సులభతరమైన పౌర సేవల్ని అందించాలని సీఎం సూచించారు. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా చెల్లింపులు ఇతర ప్రభుత్వ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కోకూడదని... ఆటోమేషన్ దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రజల్లో డిజిటల్ లిటరసీ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వంలోని 8.20 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణా సామర్థ్యాలను మరింత మెరుగు పరుచుకునేలా వివిధ కోర్సుల్లో శిక్షణ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ కోర్సులను అందించాలని సీఎం సూచించారు. వార్షిక నివేదికల్లోనూ సామర్థ్యాన్ని




ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఆర్టీజీఎస్ కేంద్రంలో ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని ఆయన అధికారులను అభినందించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏపీఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టులపై చూపిన ప్రజెంటేషన్లు బిల్ గేట్స్‌ను కూడా ఆకట్టుకున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో గేట్స్ ఫౌండేషన్ ద్వారా చేపట్టే ప్రాజెక్టులను రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు.

అత్యుత్తమ ప్రమాణాలు అనుసరించాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల్లో అమలవుతున్న అత్యుత్తమ ప్రమాణాల్ని అన్నింటా అనుసరించేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రజల నుంచి మంచి అభిప్రాయం వ్యక్తం అవుతుందని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నా క్యాంటీన్లలో వడ్డించే ఆహారాన్ని మరింత రుచికరంగా ఉండేలా చూడాలని సీఎం సూచనలు చేశారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక బెస్ట్ హాస్టల్‌ను మోడల్‌గా తీసుకుని మిగిలిన వాటిలోనూ అవే ప్రమాణాలను పాటించేలా చూడాలన్నారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో విజిబుల్ పోలీసింగ్ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నేరాల రేటును తగ్గించే అంశంలో పోలీసు విభాగం తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న చర్యల్ని ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలని హోంశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎప్పటికప్పుడు చెత్తను క్లియర్ చేయటంతో పాటు కలుషిత నీటి సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇప్పటి నుంచే ముందస్తు కార్యాచరణ చేపట్టాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు డ్రోన్ వినియోగాన్ని పెంచి పౌరసేవలను మరింత సరళతరం చేయాలన్నారు. ఈ సమీక్షకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ కె.విజయానంద్ పురపాలక, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

---

## ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడు.. కానీ సీసీ కెమెరా పట్టేసింది! 'షూ' మ్యాజిక్ ఇది..



ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడు.. అన్న సామెతకు నిదర్శనంగా నిలిచే ఘటన హైదరాబాద్ పంజాగుట్టలో వెలుగులోకి వచ్చింది. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పేరొందిన జాయ్ అలుకాస్ షోరూంలో పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగి ఏకంగా కోటి రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన విషయం ఆలస్యంగా బయటపడింది. పంజాగుట్టలోని జాయ్ అలుకాస్ షోరూమ్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. వందలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్న ఈ షోరూంలో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లికి చెందిన గోపాలకృష్ణ సీనియర్ సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అతడు కొంతకాలంగా ఆభరణాల నిల్వలపై కన్నేశాడు. సరైన సమయం చూసి ఏకంగా కోటి రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ ఘటనను గోప్యంగా విచారించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సాధారణ ఆడిట్ నిర్వహణలో భాగంగా బంగారు ఆభరణాల నిల్వలో తేడాలు కనిపించడంతో యాజమాన్యం అప్రమత్తమైంది. అయితే షోరూంలో ప్రతిచోటా సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగ ఎవరో తేలకపోవడంతో ఈ వ్యవహారం మిస్టరీగా మారింది. విషయం బయటకు రాకుండా యాజమాన్యం అంతర్గతంగా రోజూ సీసీటీవీ ఫుటేజీలను గోప్యంగా పరిశీలించింది. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. విషయం కనుగొన్న తర్వాత జాయ్ ఆలుక్కాస్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసుల విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. గోపాలకృష్ణ తను కూర్చునే కౌంటర్ దగ్గర ఆభరణాలను ఎవరికి తెలియకుండా కింద పడేసి.. వాటిని సాక్స్‌లో దాచుకుని షూలో పెట్టుకుని బయటకు వెళ్లేవాడు. ఇలా ప్రతిరోజు దాదాపు 10 గ్రాముల చొప్పున బంగారం తీసుకెళ్లి పది రోజుల్లో ఒక కిలోకు పైగా ఆభరణాలను చోరీ చేసినట్లు వెల్లడైంది. మరోవైపు పోలీసులు గోపాలకృష్ణను ఠ స్టేషన్‌కు పిలిపించి తమదైన శైలిలో విచారించగా తానే చోరీకి పాల్పడ్డానని ఒప్పుకున్నాడు.

నిందితుడి వద్ద నుంచి కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. షోరూంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఎవరికి అనుమానం రాకుండా చాకచక్యంగా చోరీ చేయడం పోలీసులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ఘటన నగరంలోని జువెలరీ షోరూంల భద్రతపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతోంది. మరోవైపు గోపాలకృష్ణ ఒక్కడే ఈ చోరీ చేశాడా? ఈ కేసులో మరెవరైనా అతడికి సహకరించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

---

## కోరం లేక వాయిదా పడ్డ సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నిక




పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. మున్సిపాలిటీలో మొత్తం15 కౌన్సిలర్ స్థానాలు ఉండగా 11 కాంగ్రెస్, 1బీఆర్ఎస్, 1ఏఐఎఫ్ బీ విజయం సాధించింది. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించగా.. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత బిరుదు రాజమల్లు కుమారుడు బిరుదు రాధాకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ సతీమణి అంతటి పుష్పలత, మున్సిపల్ మాజీ చైర్మన్ గాజుల లక్ష్మి భర్త గాజుల రాజమల్లు పోటీపడ్డారు. వీరి మధ్య సయోధ్య కుదరకపోవడంతో చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ శిబిరం నుంచి ఎవరు హాజరు కాలేదు. దీంతో చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది.

---

# కాంగ్రెస్, బీజేపీలది అపవిత్ర కలయిక..

## ఈ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ : హరీష్ రావు

టీ .హరీష్ రావు కాంగ్రెస్, బీజేపీల మధ్య అపవిత్ర కలయిక ఏర్పడిందని తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణలో అధికారం కోసం ఈ రెండు జాతీయ పార్టీలు జెండాలు, అజెండాలను పక్కనపెట్టి బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు ఒకరినొకరు బీ-టీమ్ అని విమర్శించుకున్న కాంగ్రెస్, బీజేపీలు ఇప్పుడు ఒక్కటై తెలంగాణ వ్యతిరేక టీమ్‌గా మారిపోయాయని విమర్శించారు.

మున్సిపల్ ఫలితాల్లో అలియాబాద్, అమన్‌గల్, మెదక్, నర్సాపూర్, సిర్పూర్ కాగజ్‌నగర్, మెట్‌పల్లి వంటి ప్రాంతాల్లో రెండు పార్టీలు కలిసి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను పంచుకున్నాయని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చిన చోట్ల కూడా కుట్రలతో అధికారాన్ని కైవసం చేసుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేకే ఈ అనైతిక పొత్తు కుదిరిందన్నారు.

దేశస్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్టు చెప్పుకునే కాంగ్రెస్ నేతలు, రాష్ట్రంలో మాత్రం బీజేపీతో చేతులు కలుపుతున్నారని విమర్శించారు. ఈ "ఫెవికాల్ బంధం"ను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హరీష్ రావు హెచ్చరించారు.



# టెర్రర్ నెట్‌వర్క్‌పై మోదీ సర్కార్ సర్జికల్ స్ట్రైక్:
# 'వైట్ కాలర్' ఉగ్రకుట్రను భగ్నం చేసిన భద్రతా దళాలు



న్యూఢిల్లీ/శ్రీనగర్: దేశ భద్రతను అత్యున్నత ప్రాధాన్యతగా భావించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం, ఉగ్రవాదంపై సాగిస్తున్న పోరాటంలో మరో భారీ విజయాన్ని అందుకుంది. గత 10-12 ఏళ్లుగా ఉగ్రవాద కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణిచివేస్తున్న క్రమంలో, టెక్నాలజీని అడ్డుపెట్టుకుని మేధావుల రూపంలో సాగుతున్న 'వైట్ కాలర్' ఉగ్రవాదాన్ని భద్రతా దళాలు అత్యంత చాకచక్యంగా ఛేదించాయి.

డాక్టర్ల ముసుగులో 'అన్సార్ ఇంటీరియం' కుట్ర

జమ్మూకశ్మీర్ పోలీసులు మరియు జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సమాజంలో గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న కొందరు డాక్టర్లు, రాడికల్ మత ప్రచారకులతో చేతులు కలిపి 'అన్సార్ ఇంటీరియం' అనే కొత్త ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. గ్లోబల్ ఉగ్రవాద సంస్థ 'అల్-ఖైదా'తో సంబంధాలున్న ఈ ముఠా, దేశ రాజధానితో పాటు పలు ప్రాంతాల్లో విధ్వంసానికి ప్లాన్ చేసింది.

కీలక నిందితులు - నెట్‌వర్క్ విస్తరణ దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం:

ముఠా సభ్యులు: ముజామిల్ గన్నీ, అదీల్ రాథర్, మౌల్వి ఇర్ఫాన్ మరియు మరణించిన ఉమర్-ఉన్-నబి వంటి వారు ఈ కుట్రలో కీలక సూత్రధారులు.

టెక్నాలజీ వినియోగం: ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు తెగిపోయిన తర్వాత, వీరు ఇంటర్నెట్‌ను వేదికగా చేసుకున్నారు. నిందితుడు ఉమర్ ఆన్‌లైన్ వీడియోల ద్వారా ఐఈడీ (IED) తయారీని నేర్చుకున్నట్లు తేలింది.

వ్యూహం: హర్యానాలోని సోహ్నా, నుహ్ మరియు ఫరీదాబాద్ వంటి ప్రాంతాల నుండి పొటాషియం నైట్రేట్ వంటి రసాయనాలను సేకరించి శక్తివంతమైన బాంబులను తయారు చేశారు.

ఎర్రకోట దాడి వెనుక అసలు నిజం

2025 నవంబర్‌లో ఢిల్లీ ఎర్రకోట వెలుపల జరిగిన కారు పేలుడు వెనుక ఉన్న మిస్టరీ ఈ దర్యాప్తుతో వీడింది. ప్రధాన నిందితుడు ఉమర్-ఉన్-నబి రద్దీగా ఉండే ప్రదేశాల్లో వాహన ఆధారిత పేలుడు పదార్థాలతో (ఎదీ×జుణ) భారీ మారణహోమానికి ప్లాన్ చేశాడు. అయితే, శ్రీనగర్ పోలీసులు ముందే అప్రమత్తమై గన్నీని అరెస్ట్ చేయడంతో భయాందోళనకు గురైన ఉమర్, తన ప్లాన్ విఫలమవుతుందనే కంగారులో ఎర్రకోట వద్ద అకాల పేలుడుకు పాల్పడినట్లు స్పష్టమైంది.

మోదీ ప్రభుత్వ పటిష్ట నిఘా

గతంలో ఉగ్రవాదులు కేవలం సరిహద్దులకే పరిమితం కాగా, ఇప్పుడు డిజిటల్ మాధ్యమాల ద్వారా యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనిని ముందే పసిగట్టిన మోదీ ప్రభుత్వం:

CCTV & డిజిటల్ సర్వైలెన్స్: శ్రీనగర్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి, అంతరాష్ట్ర ఉగ్ర నెట్‌వర్క్‌ను వెలికితీశారు.

అంతరాష్ట్ర సమన్వయం: కశ్మీర్ నుండి హర్యానా, ఉత్తరప్రదేశ్ వరకు విస్తరించిన ఈ ముఠాను పట్టుకోవడంలో వివిధ రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం కీలక పాత్ర పోషించింది.

ముందస్తు దాడులు: భారీ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం ద్వారా వేలమంది ప్రాణాలను భద్రతా దళాలు కాపాడాయి.

"దేశం లోపల ఉన్న శత్రువులైనా, బయట ఉన్న వారైనా సరే.. మోదీ ప్రభుత్వ హయాంలో ఎవరూ తప్పించుకోలేరని ఈ ఆపరేషన్ మరోసారి నిరూపించింది."

ముగింపు

శ్రీనగర్ శివార్లలో కనిపించిన చిన్న పోస్టర్ల ఆధారంగా మొదలైన ఈ విచారణ, ఒక భారీ అంతర్జాతీయ ఉగ్ర కుట్రను భగ్నం చేసే స్థాయికి చేరింది. టెక్నాలజీని ఆయుధంగా మార్చుకున్న ఉగ్రవాదులకు, అంతకంటే శక్తివంతమైన నిఘా వ్యవస్థతో సమాధానం ఇస్తూ దేశ భద్రతను మోదీ ప్రభుత్వం పటిష్టం చేస్తోంది.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాని విజయవంతం చేద్దాం-యంపీడీఓ



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):-నెల్లూరు జిల్లా రాపూరు పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో భవాని అధ్యక్షతన మండల వైద్యశాఖ అధికారులతో 17వ తేదీ నిర్వహించు జాతీయ నులిపురుగుల దినోత్సవం గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ భవాని జాతీయ నులిపురుగుల దినోత్సవం గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ నేడు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాల, అంగనవాడీలు,జూనియర్ కాలేజీలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం జరుపుకున్నామన్నారు.1నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర నీళ్లలో కలిపి తాపిస్తామన్నారు. అలాగే 3 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు ఒక మాత్ర నామలి మింగాలన్నారు. రేపు హాజరు కాని విద్యార్థులకు 24 తేదీనాడు మాప్వాప్ డే తో వారికి కూడా మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు.మండల అధికారులు ప్రజాప్రతినిధులు జాతీయ నులి పురుగుల దినోత్సవానికి సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రమీల రాజకుమారి, భాను, హెల్త్ సూపర్వైజర్ కిషోర్ కుమార్ ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మామిడికుదురు అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎంపీ హరీష్ బాలయోగి



డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబ సభ్యులను అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికుదురు గ్రామంలోని ఆల్ క్యాస్ట్ కాలనీలో గ్యాస్ సిలిండర్ పేలుడు వలన సుమారు ఒక 12 కుటుంబాలు వాళ్ళ ఇల్లు కోల్పోయారని అప్పటికప్పుడే స్థానిక తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కూడా వచ్చి ఆ కుటుంబాలని ఆదుకోవడం జరిగిందన్నారు. దీని గురించి స్థానిక ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్ లతో మాట్లాడటం జరిగిందన్నారు. ఆయన కూడా వచ్చి స్థానికంగా ఉన్న సమస్యలు అన్నిటిని కూడా పరిశీలిస్తూ కుటుంబాలతోనే మాట్లాడి వాళ్ళని పూర్తిగా ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకుంటూ వాళ్ళందరినీ ఆదుకుంటామని కూడా చెప్పడం జరుగుతుందన్నారు. కొన్ని కుటుంబాలకు స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కుటుంబాలందరూ కూడా ఒకే చోట ఉంటారని చెప్పి కూడా వాళ్ళు మా అందరికీ కోరిక తెలియపరచడం వల్ల వీళ్ళందరినీ కూడా ఒకే చోట ఎక్కడ అవకాశం దొరుకుతుంది అనేది కూడా పరిశీలిస్తున్నామన్నారు.అధికారులు బాధ్యత తీసుకుంటూ ఎక్కడ ల్యాండ్ అవైలబిలిటీ ఉందో దాని ప్రకారం మీరందరికీ ఒకే చోట ఇప్పించే విధంగా కూడా ఏర్పాటు చేద్దామని కూడా వాళ్ళు తెలియజేశారు. నేనే స్వయంగా కూడా ఇల్లు పట్టాలు దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడ కొంచెం అడిషనల్ ల్యాండ్ అవైలబిలిటీ ఉంది కాబట్టి దాన్ని కూడా ఏ విధంగా మనం ఉపయోగించుకోగలుగుతాము అనేది కూడా నేను కూడా స్వయంగా ముఖ్యమంత్రి వర్యులు ఈ నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకుని కూడా తీసుకెళ్తూ దీన్ని ఏ విధంగా మనం చేయగలుగుతాము అనేది కూడా బాధ్యత నేను వహిస్తామని కూడా బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

## వెలుగొండ అడవుల్లో తప్పిపోయిన పర్యాటకులు

### రక్షించిన రాపూరు పోలీసులు



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):- రాపూరు మండలంలో ఆదివారం 12 మంది పర్యాటకులు తప్పి పోయిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని పంగిలి గ్రామ సమీపాన ఉన్న వెలుగొండ ఫారెస్ట్ ఏరియాలోని మహా శివరాత్రి పర్వాదినాన మామిడి కోనను సందర్శించేందుకు వెళ్లిన 12 మంది పర్యాటకులు అడవిలో దారి తప్పిపోయారు. మొత్తం 20 మంది బృందంగా మామిడి కోన సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎనిమిది మంది సురక్షితంగా బయటకు రాగా , మిగిలిన 12 మంది అడవిలోకి వెళ్లారు. సాయంత్రం తిరిగి రావడానికి ప్రయత్నించగా, చీకటి పడటంతో దారి తెలియక అడవిలో తప్పిపోయారు.. అక్కడి పరిస్థితిని గమనించిన పర్యాటకులలో ఒకరు వెంటనే 112 అత్యవసర నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ అజిత వేజేండ్ల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రాపూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ వారి సిబ్బంది, టెక్నాలజీ సహాయంతో పర్యాటకుల లొకేషన్‌ను ట్రాక్ చేశారు. రాత్రి పది గంటల ప్రాంతంలో పోలీసులు వారిని గుర్తించారు. దట్టమైన అడవిలో గాలింపు చేపట్టిన పోలీసులు, అందరినీ సురక్షితంగా తీస్కొని రావడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తప్పిపోయిన వీరందరూ నెల్లూరు నగరంలోని అయ్యప్ప గుడి ప్రాంత వాసులుగా గుర్తించారు. తమను సురక్షితంగా తీసుకొచ్చిన పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడలు ఎంతో అవసరం

### యువత ఆసక్తి చూపండి
### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
### నరసన్నపేట లో బ్యాట్ పట్టిన మంత్రి



శ్రీకాకుళం (బిఎన్ఎస్) ఫిబ్రవరి 15 : సెల్ ఫోన్ కు, డ్రగ్స్ కు బందీ అవుతూ.. విలువైన క్రీడలకు యువత దూరం అవుతూ ఉండటం దురదృష్టకరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండల కేంద్రంలో జరుగుతున్న ఎర్రంనాయుడు ప్రీమియర్ లీగ్ -9 కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన తండ్రి దివంగత మాజీ కేంద్రమంత్రి ఎర్రంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు కాసేపు బ్యాటింగ్ ఆడి అక్కడివారిని అలరించారు.

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఎర్రంనాయుడు ప్రీమియర్ లీగ్.. యువతను క్రీడలవైపు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో 2014 లో ప్రారంభించామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. అనేక అడ్డంకులు వచ్చిన మెరుగ్గా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. నేటి యువత సెల్ చేతిలో బందీగా మారిందని, ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉండాలంటే క్రీడలు మన జీవితంలో భాగస్వామ్యం అవ్వాలని అన్నారు.

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, దేశంలో మోదీ.. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. జిల్లాలో కూడా క్రీడా వసతులు విస్తృతం చేస్తామని చెప్పారు. ఇక శ్రీకాకుళం జిల్లాలో పాత్రనివలస లో కూడా ఖేల్ ఇండియా నిధుల నుండి 14 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. మరో రెండు కూడా సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక క్రీడాకారులను అభినందించారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో.. క్రీడలు ముద్దు అన్న గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో నరసన్నపేట కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ



అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారంతో పరిష్కరించాల్సిన పలు అంశాలను భేటీలో ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్లు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ది జరుగుతుందని తుమ్మల అభిప్రాయపడ్డారు. వీటికి సంబంధించిన పలు వివరాలను ముఖ్యమంత్రికి ఆయన తెలియచేశారు. రెండు ప్రభుత్వాలు ఉన్నత స్థాయిలో సంప్రదింపుల ద్వారా ఈ సమస్యల పరిష్కారం జరుగుతుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడలు

**జెండా ఊపి బస్సు ప్రారంభించినజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



బిఎన్ఎస్, భూపాలపల్లి: తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ (సమగ్ర శిక్ష) ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కొరకు రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు జిల్లా విద్యాశాఖ తరపున బయలుదేరిన విద్యార్థుల బస్సును సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు వివిధ మండలాల నుండి మొత్తం 26 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 7 మంది తల్లిదండ్రులు బయలుదేరారు. జిల్లా తరపున పాల్గొంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, జిల్లా సమీకృత విద్య కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్యామల రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, మరియు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# పంపు ఆపరేటర్ కౌన్సిలర్ గా ప్రమాణ స్వీకారం చేసిన వేళ

**15 ఏళ్లకు అదృష్టం కలిసొచ్చిన వేళ కౌన్సిలర్ గా మారే**

**సత్తుపల్లి మున్సిపల్ 9 వ వార్డు లో అనూహ్య పరిణామం**



సత్తుపల్లి,ఫిబ్రవరి16 (బిఎన్ఎస్) : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలవేళ సత్తుపల్లి మున్సిపల్ లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సత్తుపల్లి మున్సిపాలిటీలో రిజర్వేషన్లు ఖరారులో భాగంగా తొమ్మిదో వార్డు ఎస్టి జనరల్ కు రిజర్వేషన్ ఖరారు కావడంతో సత్తుపల్లి మున్సిపాలిటీలో 9వ వార్డులో గత 15 ఏళ్లుగా పంపు ఆపరేటర్ గా పనిచేస్తున్న జగన్నాథం శ్రీనివాసరావు పేరును ఖరారు. దీంతో అదే సామాజిక వర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన పూజల రవి పై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగన్నాథ శ్రీనివాసరావు భారీ మెజార్టీతో (250ఓట్లు) గెలుపొందగా సోమవారం మున్సిపాలిటీలో పని చేసే పంప్ ఆపరేటర్ కౌన్సిలర్గా ప్రమాణస్వీకారం చేయడం పట్ల మున్సిపల్ లో పనిచేసే సహాయ సిబ్బంది, మున్సిపల్ ఉన్నత అధికారులు ఉద్యోగులు సిబ్బంది అరసం వ్యక్తం చేశారు. మున్సిపల్ లో పంప్ ఆపరేటర్ గా పనిచేసే జగన్నాథ శ్రీనివాసరావుకు కౌన్సిలర్ గా అవకాశం తగ్గటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ సోమవారం జరిగిన ప్రమాణస్వీకారంలో మున్సిపల్ ఉద్యోగులు ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. తమ తోటి ఉద్యోగి ప్రజాసేవలో మరింత మందికి ప్రజాసేవ చేయటం పట్ల మున్సిపల్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, మున్సిపల్ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచిన జగన్నాథం శ్రీనివాసరావును ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు.

# గులాబీ దళపతులు ప్రమాణ స్వీకారం"-ఓటర్ల తీర్పును శిరసా వహిస్తాం"

## నాడు మేము అభివృద్ధి చేశాం: కూసంపూడి మహేష్(మాజీ మున్సిపల్ చైర్మన్)




సత్తుపల్లి,,ఫిబ్రవరి16(బిఎన్ఎస్) :ఈ నెల 11 న జరిగిన పురపోరులో 13 న జరిగిన కౌంటింగ్ లో సత్తుపల్లి పట్టణ ఓటర్లు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తామని గులాబీ దళపతులు(బిఆర్ఎస్) నుండి గెలుపొందిన వార్డు కౌన్సిలర్లు మీడియా వద్ద స్పష్టం చేశారు. సత్తుపల్లి పట్టణ సమగ్రాభివృద్ధికి నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అనేక నిధులను తెచ్చి పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని,మన ఊరు మన బడి కార్యక్రమంలో పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మరమత్తులు చేయించామని,నూతన హంగులతో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించామని,సీసీ రోడ్లు,త్రాగునీరు,వీధిదీపాలు,సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించామని, గ్రంధాలయం నిర్మించామని,పట్టణంలో ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇచ్చామని,దోభిఘాట్,శాదీఖాన,క్రిస్టియన్ భవన్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. నీలాద్రి అర్బన్ పార్కు ఏర్పాటుకు నాడే ఆమోద ముద్ర వేశామని మాజీ చైర్మన్,ప్రస్తుత 14 వార్డు కౌన్సిలర్ కూసంపూడి మహేష్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయశీలోని సమావేశ మందిరంలో జరిగిన నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం లో కూసంపూడి మహేష్,20 వార్డు నుండి బెల్లంకొండ రాము,02 వార్డు నుండి వీరపనేని బాబీ రాధిక,17 వార్డు నుండి కొత్తూరు తులసీ ఉమామహేశ్వరరావు,11 వార్డు నుండి జాన్ మహ్మద్ మీర్జా,12 వార్డు నుండి జొన్నలగడ్డ లత లు ప్రమాణ స్వీకారం చేశారు. వారికి కల్లూరు సబ్ కలక్టర్ అజయ్ యాదవ్,మున్సిపల్ కమీషనర్ కె.నరసింహా లు పుష్పగుచ్చాలు ఇచ్చి గౌరవించారు.

# మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా విసరపు ప్రగతిశ్రీపాల్ రెడ్డి

**వైస్ చైర్మన్‌గా కాలం సునీత రవీందర్ రెడ్డి**

**15 వార్డుల్లో 9 గెలిచి కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ**


**కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహం**




బిఎన్ఎస్,మహబూబాబాద్ జిల్లా: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా కాలం సునీత రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మరిపెడ మున్సిపాలిటీలోని మొత్తం 15 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 9 వార్డులను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కాంగ్రెస్‌కు లాంఛనప్రాయంగా మారింది. సమావేశం ప్రారంభంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు ముందుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పరోక్ష పద్ధతిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మరిపెడ పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగంధర్ రెడ్డి,కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెదబోయిన ఐలమల్లు, కాంగ్రెస్ నాయకులు నల్లు శ్రీకాంత్ రెడ్డి, మాజి సర్పంచ్ రామ్లాల్,అంబరీష,అఫ్జల్,అబ్బర్బ్, సురేందర్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,గంధసిరి బిక్షపతి గౌడ్,గుండగని వెంకన్న గౌడ్,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

**ప్రమాణ స్వీకారం నిబంధనలకు అనుగుణంగా పూర్తి**



బిఎన్ఎస్, భూపాలపల్లి: 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీలో ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఐడీఓసి కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. ప్రజాస్వామ్య పద్ధతులకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమం అనంతరం చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియను అధికారులు పకడ్బందీగా పూర్తి చేశారు. కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మరియు సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించబడినట్లు వారు పేర్కొన్నారు. అన్ని దశల్లో ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంతో ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని తెలిపారు. ఆర్డీఓ హరికృష్ణ ఎన్నికైన కౌన్సిలర్లతో రాజ్యాంగ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగడంతో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రక్రియ పూర్తి కావడం గమనార్హం. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థల పాత్ర కీలకమని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత ధోరణి, ప్రజా సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అధికారుల కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఈడియం శ్రీకాంత్, మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు.


# సత్తుపల్లి వైస్ చైర్మన్ గా బొంతు సుమలత"

**03 వార్డులో 270 ఓట్లతో కౌన్సిలర్ గా ఆమె గెలుపు"**



సత్తుపల్లి ,ఫిబ్రవరి 16 (బిఎన్ఎస్)న్యూస్: సత్తుపల్లి పట్టణ పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ గా పట్టణంలోని 03 వార్డులో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి 270 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన బొంతు సుమలత వేణు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా వేదికగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దంపతులు మట్టా రాగమయి దయానంద్ లు తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించారని,ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. వైస్ ఛైర్మన్ గా పట్టణ ప్రజలకు ప్రజా రంజక పాలన అందిస్తానని రాగద్వేషాలకు పోకుండా అందరితో కలివిడిగా ఉంటూ సుపరిపాలన అందిస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి చల్లగుళ్ల నరసింహారావు,కమాల్ పాషా, కౌన్సిలర్ లు కర్నాటి విజయకుమారి వెంకటనారాయణరెడ్డి,మందపాటి ప్రభాకర్ రెడ్డి,శరత్ చంద్ర,జగన్నాధం శ్రీను, దుధిపాళ్ల రాంబాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# "మహిళాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం"





సత్తుపల్లి,ఫిబ్రవరి 16 (బిఎన్ఎస్)న్యూస్: సత్తుపల్లి మున్సిపాలిటీ ఏర్పడి నాటి నుంచి ఇప్పటికీ వరకు మైనారిటీ వర్గానికి సముచితమైన స్థానం ఎవరు కల్పించలేదు. గత పదేళ్ల పాలనలో మరియు బీఆర్ఎస్ కూడా అవకాశం ఇవ్వలేదు. అధికారం వచ్చిన వెంటనే తమ శైలిని మారిపోతున్న ఈ కాలపు నేతలలా కాకుండా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తమ వెంట అన్ని కష్టకాలంలో నిలబడిన ఎండీ కమల్ పాషా దంపతులను గుర్తు పెట్టుకొని ఉన్నతమైన స్థానాన్ని కల్పించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సత్తుపల్లి మున్సిపల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్మన్ మరియు వైస్ చైర్మన్ మహిళలకు అవకాశం కల్పించారు. ఇక్కడ ఒక విషయం గమనించాలి. మొట్టమొదటి సారిగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే , మున్సిపల్ చైర్మెన్ మరియు వైస్ చైర్మన్ లు పదవులలో మహిళలు ఉండడం గమనార్హం.



# సినిమా న్యూస్



## బాలీవుడ్‌లో రష్మిక కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్..!


నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా వరుస ఆఫర్లతో దూసుకుపోతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. హోమీ అడజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రష్మిక, షాహిద్ ప్రేమికులుగా సందడి చేయబోతున్నారు. అయితే, ఈ సినిమా విడుదల కాకముందే వీరిద్దరి కాంబినేషన్‌లో మరో కొత్త ప్రాజెక్ట్ ఖరారైందనే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

ఇంకా పేరు ఖరారు కాని ఈ సినిమాలో రష్మిక, షాహిద్ భార్యాభర్తలుగా కనిపించబోతున్నారట. ఇది ఒక 'సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ' డ్రామా అని సమాచారం. వైవాహిక జీవితంలో వచ్చే ఇబ్బందులకు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే ఎలా ఉంటుందనేది ఈ సినిమా కథాంశం అని తెలుస్తోంది. 'బదాయి హో', 'మైదాన్' వంటి సినిమాలతో తన మార్క్ చూపించిన దర్శకుడు అమిత్ శర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభం కానుందని బాలీవుడ్ వర్గాల సమాచారం.

## షూటింగులో ప్రభాస్ కి గాయం

టాలీవుడ్ అగ్ర హీరో ప్రభాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కృష్ణంరాజు వారసత్వాన్ని అందుపుచ్చుకొని ఇండస్ట్రీని దున్నేస్తున్నాడు ప్రభాస్. అయితే అలాంటి ప్రభాస్ అభిమానులకు ఊహించని ఎదురుదెబ్బ తగిలినట్లు వార్తలు వస్తున్నాయి. టాలీవుడ్ అగ్ర హీరో ప్రభాస్ తాజాగా గాయపడినట్లు టాక్ నడుస్తోంది. ప్రస్తుతం ఫౌజీ మూవీ షూటింగ్ లో ప్రభాస్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సందర్భంగా ప్రభాస్ కు గాయమైనట్లు చెబుతున్నారు.

సంక్రాంతి కానుకగా రాజా సాబ్ సినిమాతో మెరిసిన ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ లో భాగంగా హార్స్ రైడ్ చేశారట. ఈ తరుణంలోనే ప్రభాస్ కు గాయం అయినట్లు సినీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. హార్స్ రైడ్ చేస్తుండగా ప్రభాస్ కింద పడిపోయారట. దీంతో అతని చేతులకు గాయాలైనట్లు సమాచారం. అనంతరం అలర్ట్ అయిన చిత్ర బృంద సభ్యులు వెంటనే, ప్రభాస్ కు ప్రథమ చికిత్స అందించారట. అయితే గాయాలు పెద్దవి కాకపోవడంతో ఒకటి లేదా రెండు రోజుల పాటు ప్రభాస్ రెస్ట్ తీసుకోవాలని వైద్యులు చెప్పినట్లు సమాచారం. దీంతో ఎప్పటి లాగే రెండు రోజుల్లో ప్రభాస్ షూటింగులో పాల్గొంటారని టాక్ నడుస్తోంది. కాగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఈ ఫౌజీ సినిమా వస్తోంది. స్పిరిట్ కంటే ముందే ఈ ఫౌజీ రానుంది. అందుకే ప్రభాస్ దూకుడుగా షూటింగ్ లో పాల్గొంటున్నారు.






### చివరి నిమిషంలో

## హే భగవాన్' టైటిల్ మార్పు

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న హీరో సుహాస్, శివాని నాగరం జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'హే భగవాన్' విడుదలకు సిద్ధమైంది. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుండి ఊహించని షాక్ తగిలింది. మొదట ఈ చిత్రానికి 'హే భగవాన్!' అనే టైటిల్‌ను ఖరారు చేసి ప్రమోషన్లు కూడా పూర్తి చేశారు. కానీ, సెన్సార్ బోర్డు ఈ టైటిల్‌పై అభ్యంతరం వ్యక్తం చేయడంతో మేకర్స్ చివరి నిమిషంలో పేరు మార్చక తప్పలేదు. సెన్సార్ బోర్డు నిబంధనల ప్రకారం.. దైవ నామాలను లేదా భక్తికి సంబంధించిన పదాలను వినోదం కోసం వాడటంపై కొన్ని ఆంక్షలు ఉన్నాయి. అందుకే. 'హే భగవాన్' అనే పేరు మార్చకపోతే సినిమాకు 'ఏ' సర్టిఫికేట్ ఇస్తామని బోర్డు తేల్చి చెప్పడంతో, చిత్ర యూనిట్ వెనక్కి తగ్గి టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చింది. ఈ విషయాన్ని మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించింది.

కేవలం నాలుగు రోజుల ముందే ఇలా టైటిల్ మారడం సినిమా ప్రమోషన్లపై కొంత ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ మూవీ మేకర్స్ యూ/ఏ సర్టిఫికెట్ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులు షాక్ అవుతున్నారు. కాగా.. గోపి అచ్చర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో వీకే నరేష్, యాంకర్ స్రవంతి, అన్నపూర్ణమ్మ కీలక పాత్రల్లో నటించారు. తండ్రీకొడుకుల మధ్య సాగే ఒక విభిన్నమైన కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 20న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. అయితే ఇలా జరగడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల ఇలాంటి సమస్యలు టాలీవుడ్‌లో ఎక్కువయ్యాయి. సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్ మార్చకపోవడం వల్ల ఆ సినిమాకు 'ఏ' సర్టిఫికేట్ ఇచ్చారు. గత నెలలో 'వానర' అనే సినిమా పేరును కూడా 'వనవీర'గా మార్చాల్సి వచ్చింది.




## ఆ వీడియో నా జీవితాన్నే మార్చేసింది

సినిమా ఇండస్ట్రీలోకి కొంతమంది కుటుంబ అంగీకారంతో వస్తే, మరి కొంతమంది మాత్రం సినిమాపై ప్యాషన్ ఉండి, కుటుంబం దానిని వ్యతిరేకించిన వారి నుండి దూరమై పరిశ్రమలోకి వస్తుంటారు. కుటుంబానికి ఇష్టం లేకపోయినా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి ప్రస్తుతం తనకంటూ ఒక గుర్తింపు ఏర్పరచుకున్న ముద్దుగుమ్మలలో ఇనయా సుల్తానా ఒకరు. ఈ బ్యూటీ తెలుగు బిగ్ బాస్ కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసింది. దీని ద్వారా ఈ నటి బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత ఈమె పలు టీవీ షోలలో కూడా పార్టిసిపేట్ చేసింది. అలాగే కొన్ని సినిమాల్లో కూడా నటించింది.

తాజాగా ఇనయా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈ నటి తనకు ఒక వీడియో ద్వారా అనేక కష్టాలు ఎదురయ్యాయని, ఆఖరికి దానివల్ల కుటుంబం మొత్తానికే దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేసింది. తాజాగా ఇనయా సుల్తానా మాట్లాడుతూ... "నేను పుట్టినరోజు వేడుకల్లో రామ్ గోపాల్ వర్మ గారితో కలిసి డాన్స్ చేశాను. ఆ వీడియో అంతలా వైరల్ అవుతుందని నేను అనుకోలేదు. తీరా చూస్తే ఆ తర్వాత ఆ వీడియో చాలా వైరల్ గా మారింది. దాని ప్రభావం నాపై చాలా గట్టిగా పడింది. వీడియో వైరల్ అయిన తర్వాత నా కుటుంబం నన్ను దూరం పెట్టింది.

ఆ తర్వాత నా కుటుంబం మాత్రమే కాకుండా నా బంధువులు కూడా నన్ను దూరం పెట్టడం మొదలుపెట్టారు" అని ఆమె చెప్పింది. అలాగే నేను సినిమాల్లోకి రావడం మొదటి నుండి మా కుటుంబానికి ఇష్టం లేదు. అయినా కూడా నేను ఇండస్ట్రీ లోకి రావాలనుకున్నాను. దానితో నేను కేవలం 100 రూపాయలతో ఇంట్లో నుండి బయటకు వచ్చేసాను. హాస్టల్ ఫీజుల కోసం, ఖర్చుల కోసం చిన్న చిన్న పాత్రల్లో నటించాను. కాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కొని ఎన్నో అవకాశాలను వదులుకున్నాను. ప్రస్తుతం ఎలాంటి కమిట్మెంట్లు లేకుండా మంచి అవకాశాలను అందుకుంటున్నాను. నిజాయితీగా సినిమా ఇండస్ట్రీలో ఎదుగుతున్నందుకు ఆనందంగా ఉంది అని ఇనయా సుల్తానా చెప్పుకొచ్చింది.